పత్తి అమ్మకాల్లో సందేహాలా.. నివృత్తి చేసుకోండి

నేడు జేడీఎం శ్రీనివాస్‌తో ఫోన్ ఇన్



పత్తి కొనుగోళ్లకు భారత పత్తి సంస్థ (సీసీఐ) సిద్ధమవుతోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతులు ఈ ఏడాది 5,13,289 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. 4,10,632 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. పత్తిలో తేమశాతం ఆధారంగా సీసీఐ ధర నిర్ణయిస్తుంది. ఈ నేపథ్యంలో గిట్టుబాటు ధర పొందడానికి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి. అకాల వర్షాలతో రంగు మారిన పత్తి అమ్మకం ఎలా?.. సీసీఐ నిబంధనలు ఏమిటి? తదితర సందేహాలు రైతులకు వస్తున్నాయి. గురువారం కింది నెంబర్లకు ఫోన్ చేసి వాటిని నివృత్తి చేసుకోవచ్చు. మార్కెటింగ్‌శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు (జేడీఎం) వి.శ్రీనివాస్ సమాధానాలు ఇస్తారు.

– న్యూస్‌టుడే, ఎనుమాముల మార్కెట్

సంప్రదించాల్సిన చరవాణి నెంబరు
73307 33669, 8985131057
సమయం: ఉదయం 10 నుంచి 11 గంటల వరకు

పాలిటెక్నిక్ కళాశాలకు రూ.28 కోట్లు మంజూరు

మట్టెవాడ, న్యూస్‌టుడే: నగరంలో ప్రతిష్ఠాత్మకమైన విద్యాక్షేత్రంగా విరాజిల్లుతున్న వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల రూపురేఖలు త్వరలో మారబోతున్నాయి. 1955లో నిర్మించిన భవనం కావడంతో భవనాలు శిథిలావస్థకు చేరాయి. 68 ఏళ్ల క్రితం కట్టిన గదుల్లోనే విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ చదువుకుంటున్నారు. కొన్నిసార్లు పైకప్పు నుంచి పెచ్చులూడిన సందర్భాలు ఉన్నాయి. దీంతో విద్యార్థులు పలుమార్లు నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ.. ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందించారు. ఇటీవల కళాశాల విద్యార్థులు, పూర్వ విద్యార్థులు నిధుల విషయాన్ని వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు రూ.28 కోట్ల నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో సుదీర్ఘకాలంగా విద్యార్థులు ఎదురుచూస్తున్న కళాశాల నూతన భవన నిర్మాణానికి అడుగులు పడనున్నాయి. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



60 నిమిషాలు.. 3,300 వాహనాలు

కాజీపేట పాత రైల్వే వంతెనపై రోజురోజుకు ట్రాఫిక్ రద్దీ పెరుగుతోంది. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రతి గంటకు ఒకసారి 'న్యూస్‌టుడే' పరిశీలించగా సగటున నిమిషానికి 55 వాహనాలు రాకపోకలు సాగించాయి. అంటే గంటకు 3,300 వాహనాలు ఆ వంతెనపై తిరుగుతున్నాయి.

● కాజీపేట ఆర్వోబీపై ట్రాఫిక్ రద్దీ

ఇదీ పరిస్థితి..

● 1976లో నిర్మించిన ఈ వంతెన శిథిలావస్థకు చేరుకొంది. రెండో ఆర్వోబీ నిర్మాణం పనులు పూర్తిచేస్తే దీనిపై సగం ట్రాఫిక్ భారం తగ్గించవచ్చు. పాత వంతెనపై తరచూ ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి.

● ఉదయం 8 నుంచి 9 మధ్య, సాయంత్రం 4 నుంచి 8 గంటల మధ్య వాహనాల రద్దీ అధికంగా ఉంటోంది.

– న్యూస్‌టుడే, కాజీపేట

పరిశీలించిన సమయం

ఉదయం 8 నుంచి 9 గంటల మధ్య,
మధ్యాహ్నం 12 నుంచి 1 గంట మధ్య
సాయంత్రం 5 నుంచి 6 గంటల మధ్య.

ఒక నిమిషంలో రాకపోకలు సాగించిన వాహనాలు

ఉదయం 8 గంటలకు : 60
మధ్యాహ్నం 1 గంటకు : 48
సాయంత్రం 5 గంటలకు : 58



విభేదాలు వీడి వంతెనను పట్టించుకోండి!

కాజీపేట రైల్వే వంతెన ఉమ్మడి జిల్లా అభివృద్ధిలో కీలకం.. ఇక్కడి అసంపూర్తి వంతెనతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ నేతలు తమ మధ్య ఉన్న విభేదాలు వీడి దీని నిర్మాణం పూర్తికి కలిసికట్టుగా ముందుకు సాగాలని ప్రజలు కోరుతున్నారు. 1976లో నిర్మించిన వంతెన ఇరుకుగా మారి పెచ్చులూడుతుంది. రోడ్డు మీద గుంతలు పడి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఎక్కువ వాహనాలు వచ్చినా, ఏదైనా పైన ఆగిపోయినా ట్రాఫిక్ నిలిచిపోతుంది. వీఐపీలు వచ్చినప్పుడు ఎలాంటి ట్రాఫిక్ జామ్ కాకూడదని వాహనాలను నిలిపి వేస్తారు. వంతెన మీద వాహనాలు నిలిచిపోవడంతో రైళ్లను సరైన సమయానికి అందుకోలేక ప్రయాణాలను రద్దు చేసుకున్న వారున్నారు. గత ప్రభుత్వం రూ.78 కోట్లతో కొత్త వంతెన నిర్మాణం చేపట్టింది. రైలు పట్టాలకు ఇరువైపులా నిర్మాణం పూర్తయింది. పట్టాల మీద గడ్డర్ల ఏర్పాటు నిలిచిపోయి ఇప్పటికి రెండేళ్లు కావస్తోంది. మంత్రులు, ఎమ్మెల్యేలు కలిసికట్టుగా పనిచేస్తే ఇది వేగంగా పూర్తవుతుంది.

– న్యూస్‌టుడే, కాజీపేట

అసలేం జరుగుతోంది?

● మంత్రి కొండా సురేఖపై సొంత పార్టీ ఎమ్మెల్యేల అసంతృప్తి

రంగంపేట, న్యూస్‌టుడే



ఓరుగల్లు కాంగ్రెస్ రాజకీయం రోజురోజుకు వేడెక్కుతోంది. మంత్రి కొండా సురేఖపై సొంత పార్టీ ఎమ్మెల్యేలే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గత రెండు రోజులుగా కాంగ్రెస్ పెద్దలను కలిసి వరుస ఫిర్యాదులు చేయడం ఉమ్మడి జిల్లా కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారింది. కొన్ని నెలలుగా ఇది అంతర్గతంగా సాగినా ఇటీవల జరిగిన ఘటనలతో బహిర్గతమైంది. మంగళవారం రాత్రి హైదరాబాద్‌లో ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షిని ఎమ్మెల్యేలు, ఉమ్మడి జిల్లాకు చెందిన ముఖ్యనాయకులు కలిశారు. బుధవారం ఉదయం టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌తో భేటీ అయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోనూ మాట్లాడే ప్రయత్నం చేసినా సమయం లేకపోవడంతో వాయిదా పడింది. దిల్లీ నుంచి వచ్చాక కలిసే అవకాశం ఉంది.

పార్టీకి నష్టం..

● వరంగల్ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో మంత్రి సురేఖ ఒకవైపు, సొంత పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు మరోవైపు ఉండడంపై కాంగ్రెస్ సీనియర్ నాయకులు సైతం అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

● మంత్రి వ్యవహరిస్తున్న తీరు, ఒంటెద్దు పోకడలతో పార్టీకి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అధిష్ఠానం పెద్దలకు వివరించినట్లుగా తెలిసింది. శాసనసభ నియోజకవర్గాల్లో స్థానిక ఎమ్మెల్యేలు సుప్రీం అని.. ఏదీ జరిగినా తామే కదా జవాబుదారీ అని టీపీసీసీ అధ్యక్షుడికి వివరించారు. ఎమ్మెల్యేలు, ఉమ్మడి జిల్లా నాయకులను సమన్వయం చేయాల్సిన బాధ్యత జిల్లా మంత్రులపై ఉందని.. ఇందుకు విరుద్ధంగా వ్యవహరించడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు..

● మంత్రి సురేఖ వాదన మరోలా ఉంది. తమను నమ్ముకున్న కార్యకర్తల కోసం ఉక్కు పిడికిలితో సమాధానం చెబుతామని బహిరంగంగా ప్రకటించారు. పరకాల నియోజకవర్గంతో చాలా అనుబంధం ఉందని, కార్యకర్తలపై దాడులు, పోలీసు కేసులు పెడితే చూస్తూ ఉండాలా? అని వ్యాఖ్యానించారు. గీసుకొండ పోలీసు స్టేషన్‌లో, ధర్మారంలో జరిగిన దాడులు, ఇతర విషయాలను సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వివరించినట్లుగా తెలిసింది. పార్టీకి నష్టం కలిగించడం తన ఉద్దేశం కాదని తెలియజేసినట్లు సమాచారం.

త్వరలోనే సమావేశం

వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులతో త్వరలోనే సమావేశం ఉంటుందని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ ఉమ్మడి జిల్లా నాయకులతో మాట్లాడే అవకాశాలున్నాయి. అందర్ని సమన్వయం చేసే బాధ్యత జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి అప్పగించారు.

కొలువుదీరిన గురువులు

● జిల్లాలో 254 మంది ఉపాధ్యాయులకు పాఠశాలల కేటాయింపు

నర్సంపేట, వరంగల్ విద్యావిభాగం, న్యూస్‌టుడే

ప్రభుత్వ ఉద్యోగం ఎంతో మంది యువకుల కల. . అందులోనూ ఉపాధ్యాయ కొలువంటే ఎంతో ప్రత్యేకం. అలాంటి నౌకరి కోసం చాలా మంది పోటీ పడ్డారు. బడి పంతులు కావాలని ఎంతో కష్టపడ్డారు. ప్రైవేటు ఉద్యోగాలు చేస్తూ.. లక్ష్యాన్ని మరవకుండా శ్రమించారు. ఎట్టకేలకు కలల కొలువు దక్కి.. తొలి రోజు పాఠశాలల్లో అడుగు పెట్టడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. జిల్లాలో డీఎస్సీ-2024 ద్వారా ఎంపికైన 254 మంది ఉపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖ పాఠశాలలను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. బుధవారం ఆయా పాఠశాలల్లో నూతన ఉపాధ్యాయులు రిపోర్ట్ చేశారు. కొత్త గురువుల రాక ఉపాధ్యాయుల కొరత తీరి.. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందనుంది. తొలిరోజు బడికి వచ్చిన వారికి ఘన స్వాగతం పలికారు.

జిల్లా వివరాలు

ప్రాథమిక పాఠశాలలు 479
ప్రాథమికోన్నత 85, ఉన్నత 160
మొత్తం విద్యార్థులు 46,508 మంది
పనిచేస్తున్న ఉపాధ్యాయులు 2,461
కొత్తగా భర్తీ అయ్యింది: 254 మంది

కొన్నిచోట్ల వసతుల కొరత..: జిల్లా పరిధిలోని కొన్ని పాఠశాలల్లో ఇప్పటికి మౌలిక వసతులు లేవు. గత ప్రభుత్వం మనఊరు- మనబడి పథకం కింద తొలి విడతలో కొన్ని పాఠశాలలను ఎంపిక చేసి.. పనులు ప్రారంభించినా పూర్తి కాలేదు. చేసిన పనులకు నిధులు రాకపోవడంతో గుత్తేదారులు మధ్యలో వదిలేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ విద్య బలోపేతానికి చర్యలు తీసుకుంటోంది.

పొద్దంతా పని.. రాత్రి సన్నద్ధం..

- సట్ల మధులత, ద్వారకాపేట



మాది నర్సంపేట పట్టణం ద్వారకాపేట. అమ్మానాన్న సట్ల రమాదేవి- నర్సయ్య. చిన్నప్పటి నుంచి ప్రభుత్వ ఉపాధ్యాయురాలు కావాలని అనుకునేదాన్ని. 2018లో డీఎడ్ పూర్తి చేశా. తర్వాత నర్సంపేటలో ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేశాను. ఉపాధ్యాయ ఉద్యోగ ప్రకటన వెలువడినప్పటి నుంచి పొద్దంతా ప్రైవేటు పాఠశాలలో పనిచేసి.. ఇంటికొచ్చాక సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు ప్రణాళిక ప్రకారం నాలుగు నెలలు సన్నద్ధమయ్యాను. 3-10 తరగతి పాఠ్య పుస్తకాలతో పాటు అకాడమిక్ మోడల్ పేపర్లు ఆన్‌లైన్‌లో పోటీ పరీక్షలకు సంబంధించిన అంశాలను చదవడంతో జిల్లా స్థాయిలో పదో ర్యాంకు వచ్చింది. కలల కొలువు దక్కడం ఆనందంగా ఉంది. ఉపాధ్యాయురాలిగా తొలిరోజు నా జీవితంలో మరిచిపోలేనిది.

రోజుకు 10 గంటల పాటు..



- జన్ను శివ

మా స్వగ్రామం దుగ్గొండి మండలం నాచినపల్లి. అమ్మానాన్నలు విజయ- మల్లయ్య పనిచేస్తేనే పూట గడిచే పరిస్థితి. ఎలాంటి స్థిరచరాస్తులేవు. కష్టమైనా నన్నూ, అన్నయ్యను చదివించారు. పాఠశాల విద్య జనగామలోని ఏపీ ఎస్ఆర్‌డబ్ల్యూఎస్‌లో పూర్తి చేశా. వరంగల్ సీకేఎంలో డిగ్రీ చదివాను. 2012-14లో హనుమకొండలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో డీఎడ్ పూర్తయ్యాక.. ఉపాధ్యాయ కొలువు సాధించాలనే సంకల్పంతో సన్నద్ధమయ్యా. కొంతకాలం ప్రైవేటు పాఠశాలల్లో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేశా. ఉద్యోగల ప్రకటన వెలువడ్డాక డీఎస్సీ కోసం ప్రైవేటు ఉద్యోగం మానేసి రోజుకు 10గంటలు కష్టపడి చదివాను. 3-9 తరగతి వరకు పాఠ్య పుస్తకాలతో పాటు అకాడమిక్ మోడల్ పేపర్లు తిరగేశా. కష్టానికి ప్రతిఫలంగా ఇష్టమైన బడి పంతులు ఉద్యోగం రావడం సంతోషంగా ఉంది.

బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించండి



సమావేశంలో మేయర్, కమిషనర్, అధికారులు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: గ్రేటర్ వరంగల్ పరిధిలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో వ్యాపార అనుమతి(ట్రేడ్ లైసెన్సు) రుసుం వసూళ్ల లక్ష్యం రూ.11 కోట్లు కాగా, ఇప్పటి వరకు రూ.3 కోట్లు మాత్రమే వసూలు అయ్యాయని మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే పేర్కొన్నారు. మిగిలిన రూ.8 కోట్ల బకాయిలు వసూలు చేసేందుకు దృష్టి సారించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు. బుధవారం సాయంత్రం బల్దియా సమావేశ మందిరంలో ప్రజారోగ్య విభాగం ఉద్యోగులతో సమావేశమయ్యారు. పారిశుద్ధ్యం, ఇంటింటా చెత్త సేకరణ, వాహనాల మరమ్మతులు, ట్రేడ్ లైసెన్సు ఫీజుల వసూళ్లపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో సీఎంహెచ్ఓ డా.రాజిరెడ్డి, ఎంహెచ్‌వో డా.రాజేష్, బయాలజిస్టు మాధవరెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

● ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళలకు ఆర్థిక చేయూత కల్పించేందుకు బ్యాంకర్లు సహకరించాలని మేయర్ సుధారాణి, కమిషనర్ అశ్విని తానాజీ కోరారు. బుధవారం రాత్రి బ్యాంకర్లు, మెప్మా అధికారులు, ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. గ్రేటర్ వరంగల్ పరిధిలో మహిళా శక్తి పథకం ద్వారా 215 స్వయం సహాయక సంఘాల యూనిట్లు లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 48 పూర్తయ్యాయని, వ్యక్తిగత యూనిట్లు 1318 లక్ష్యం కాగా 378 పూర్తయ్యాయన్నారు. వివిధ బ్యాంకర్లు సహకారం అందించాలన్నారు. వరంగల్, హనుమకొండ ఎల్‌డీఎంలు రాజా, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎంజీఎంలో అనస్తీషియా డే



మాట్లాడుతున్న ఎంజీఎం సూపరింటెండెంట్ డా.మురళి

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో బుధవారం 'ప్రపంచ అనస్తీషియా డే' వేడుకలు నిర్వహించారు. సూపరింటెండెంట్ డా.చిలుక మురళి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మొదటిసారి డబ్ల్యూటీజీ మోర్టాన్ ఈథర్‌ను ఉపయోగించి దవడ సంబంధిత శస్త్రచికిత్స విజయవంతంగా, నొప్పిలేకుండా నిర్వహించడాన్ని పురస్కరించుకొని ప్రపంచ వ్యాప్తంగా ఏటా అక్టోబరు 16న ప్రపంచ అనస్తీషియా డే నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంజీఎం అనస్తీషియా విభాగం హెచ్‌వోడీ డా.హనుమంతరావు, ఇతర మత్తు వైద్య నిపుణులు, పీజీ వైద్యులు పాల్గొన్నారు.

నేడు రైతులతో కలెక్టర్ సమావేశం

ఖిలావరంగల్: తూర్పుకోట రైతు వేదిక భవన్ వద్ద హైడెన్సీ(సాలు) పద్ధతిలో వేసిన పత్తి పంటను గురువారం ఉదయం 8 గంటలకు కలెక్టర్ సత్యశారద సందర్శించనున్నారు. అనంతరం ఆమె రైతులతో మాట్లాడతారు. ఆమెతో పాటు జేడీ, కేవీకే శాస్త్రవేత్తలు, నూజివీడు విత్తన కంపెనీ ప్రతినిధులు హాజరుకానున్నారు.

ఉత్సాహంగా సీఎం కప్ టార్చ్ ర్యాలీ

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ప్రతిభ గల క్రీడాకారులను ప్రోత్సహించడానికి సీఎం కప్-2024 క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్యశారద తెలిపారు. బుధవారం వరంగల్‌కు చేరుకున్న సీఎం కప్ టార్చ్‌కు పోచమ్మమైదాన్ వద్ద కలెక్టర్, డీసీపీ రవీందర్ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సీఎం కప్ పట్ల విస్తృతంగా చైతన్యం కలిగించి పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి క్రీడాకారులు పాల్గొనేలా చూడాలన్నారు. ఎంజీఎం కూడలి, కేఎంసీ, ములుగురోడ్డు మీదుగా వేయి స్తంభాల దేవాలయం వరకు ర్యాలీ సాగింది. అక్కడ హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య, సీపీ అంబర్ కిషోర్ ఝాకు టార్చ్ అందించారు. కార్యక్రమంలో సీపీ అంబర్ కిషోర్ ఝా, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీసీపీ షేక్ సలీమా, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ అధికారులు గోకుల్, మధు, రతన్‌బోస్, హనుమకొండ జిల్లాల క్రీడల అధికారులు సత్యవాణి, అశోక్‌కుమార్, ఒలింపిక్ సంఘం ప్రతినిధులు మహ్మద్ అజీజ్‌ఖాన్, కైలాస్‌యాదవ్, వరద రాజేశ్వరరావు, సారంగపాణి, పవన్, పీఈటీ, పీడీల సంఘాల ప్రతినిధులు, డీఎస్‌ఏ కోచ్‌లు పాల్గొన్నారు.




ర్యాలీలో కలెక్టర్ సత్యశారద, డీసీపీ రవీందర్ తదితరులు

ఎవరా వ్యక్తి.. వివరాలు తెలుసుకోండి

ఉత్సాహంగా సాగుతున్న ర్యాలీలో ఓ కోచ్ ప్రవర్తనపై వరంగల్ కలెక్టర్ డా.సత్యశారద ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. టార్చ్ ర్యాలీ వేయి స్తంభాల దేవాలయం సమీపంలోకి వస్తున్న క్రమంలో హైదరాబాద్ నుంచి వచ్చిన ఓ కోచ్.. కలెక్టర్‌ను ఆపి ఆమె చేతిలో నుంచి టార్చ్ బలవంతంగా తీసుకున్నాడు. ఒక్కసారిగా ఏం జరుగుతుందో తెలియక కలెక్టర్ అలాగే ఉండిపోయారు. ఆ తర్వాత తేరుకొని కలెక్టర్ మళ్లీ టార్చ్ తీసుకొని ర్యాలీని పూర్తి చేశారు. ఎలాంటి సమాచారం ఇవ్వకుండా టార్చ్ తీసుకున్న వ్యక్తి ఎవరు, అలా ఎందుకు తీసుకున్నాడు అనే విషయాలు తెలుసుకొని పూర్తి సమాచారం ఇవ్వాలని సంబంధిత అధికారులను కలెక్టర్ వివరణ కోరినట్లు సమాచారం.

ఇదేందయ్యా ఇది..



జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గ కేంద్రం శివారులోని విద్యుత్తు సబ్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న ప్రధాన విద్యుత్తు లైన్‌కు పిచ్చి తీగలు అల్లుకున్నాయి. ఏకంగా 10 అడుగుల మేర చుట్టుకోవడంతో విద్యుత్తు తీగలు ప్రమాదకరంగా వేలాడుతూ, తెగిపోయేలా న్నాయి. వాటిని తొలగించి, ముందస్తు ప్రమాదాన్ని నివారించాలని స్థానిక రైతులు, ఆయా మార్గంలో వెళ్లే ప్రయాణికులు కోరుతున్నారు. ఈ విషయమై విద్యుత్తు ఏఈ రణధీర్‌ను వివరణ కోరగా.. తొలగించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

– న్యూస్‌టుడే, పాలకుర్తి

నలుపు వరి.. ఆరోగ్య సిరి



చుట్టూ పచ్చని పొలాలు.. మధ్యలో నల్లగా ఉన్న పంటను చూస్తే తెగులు సోకిందని అనుకుంటే పొరపాటే.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం మొట్లపల్లిలో 15 గుంటలు విస్తీర్ణంలో మహిళా రైతు కొప్పుల కోమల బ్లాక్ రైస్ సాగు చేశారు. తన కుమారుడు బెంగళూరులో ఆయుర్వేద డాక్టర్‌గా శిక్షణ పొందుతున్న క్రమంలో అక్కడి నుంచి తెచ్చిన వరి వంగడాన్ని తెచ్చి సాగు చేసినట్లు వివరించారు. ఆరోగ్యపరంగా పలు ప్రయోజనాలు ఉండటంతో పాటు సాగు సులువుగా చేయవచ్చని.. అందుకే బ్లాక్ రైస్ పండించేందుకు రైతులు ఆసక్తి చూపిస్తున్నారని వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం సహ సంచాలకులు రావుల ఉమారెడ్డి తెలిపారు.

– ఈనాడు, హనుమకొండ–న్యూస్‌టుడే, మొగుళ్లపల్లి

ప్రాణాలతో చెలగాటమా?



అసలే జాతీయ రహదారి... వాహనాలు వాయువేగంతో దూసుకెళ్తాయి. జనగామ జిల్లా రఘునాథపల్లి టోల్ ప్లాజా వద్ద వాహనంపై ప్రమాదకరంగా ప్రయాణం చేస్తూ ఇలా కనిపించారు. ముందూ వెనక ఎటువంటి ఆసరా లేకుండా ప్రయాణం చేస్తున్నారు. ప్రమాదవశాత్తు పడితే అంతేసంగతులు..

– ఈనాడు,హనుమకొండ

శిక్షణ పొందుతూ.. ప్రత్యక్షంగా వీక్షిస్తూ..



రామప్ప ఆలయంలో వాలంటీర్ల బృందం

వెంకటాపూర్, న్యూస్‌టుడే: యునెస్కో గుర్తింపు పొందిన రామప్పలో వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ల శిక్షణ రెండో రోజు కొనసాగింది. బుధవారం ఉదయాన్నే యోగా గురువు రాంబాబు ఆధ్వర్యంలో యోగాసనాలు వేయించారు. అనంతరం కాకతీయ హెరిటేజ్ ట్రస్టు కన్వీనర్ ప్రొఫెసర్ పాండురంగారావు వాలంటీర్లకు శిక్షణ తరగతులను తీసుకున్నారు. రామప్పకు యునెస్కో గుర్తింపు ఎలా వచ్చింది? ఆలయ నిర్మాణ శైలి ఎంటీ? కాకతీయులు వాడిన సాంకేతిక పరిజ్ఞానం ఎంటీ? ప్రపంచ స్థాయిలో ఇలాంటి సాంకేతిక పరిజ్ఞానం ఇంకెక్కడైనా ఉందా? గుర్తింపునకు ఎలాంటి కారణాలు దోహదపడ్డాయనే అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. మధ్యాహ్నం ప్రొఫెసర్ దేవాప్రతాప్ ఆలయ నిర్మాణంలో వాడిన సామగ్రి, వాటి సేకరణ, ప్రత్యేకంగా ఆ సామగ్రినే ఉపయోగించడానికి గల కారణాలు, వాటికిచ్చిన ప్రాధాన్యం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. శిక్షణ తరగతుల అనంతరం రామప్ప ఆలయానికి చేరుకుని శిక్షణలో తెలుసుకున్న విషయాలను స్వయంగా ఆలయంలో వీక్షించి వాలంటీర్ల సందేహాలను నివృత్తి చేశారు. ఆలయంలోని రాగిని, నాగిని శిల్పాలు, సాండ్‌బాక్స్ టెక్నాలజీ, కామేశ్వర, కాటేశ్వరాలయ నిర్మాణాలను స్వయంగా చూశారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో సామూహికంగా ఫొటోలు దిగారు. కార్యక్రమంలో వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ శిక్షణ ఇన్‌ఛార్జి శ్రీధర్‌రావు, పర్యాటకశాఖ అధికారి సూర్యకిరణ్, పురావస్తు, పర్యాటక శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

యువజన సంఘాల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఉమ్మడి వరంగల్ జిల్లాల పరిధిలో యువజన సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించేందుకు యువజన సంఘాల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్రం ఉమ్మడి జిల్లా సమన్వయ అధికారి చింతల అన్వేశ్ బుధవారం తెలిపారు. యువజన సంఘాల్లోని సభ్యుల వయసు 18 నుంచి 29లోపు ఉండాలన్నారు. ఆసక్తి ఉన్న యువజన సంఘాలు నమోదు కోసం సభ్యుల ఆధార్‌కార్డు, సంఘం ప్రతులను హనుమకొండలోని నెహ్రూ యువకేంద్రం కార్యాలయంలో ఈ నెల 19లోపు సమర్పించాలన్నారు. సంక్షేమ కార్యక్రమాల నిర్వహణలో యువజన సంఘాలను భాగస్వామ్యం చేయడమే లక్ష్యమని సమన్వయ అధికారి తెలిపారు. మరిన్ని వివరాలకు 0870 2958776 సంప్రదించాలన్నారు.

చికెన్ ధరలు


(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	126
రిటైల్:	148
డ్రెస్డ్:	215
స్కిన్‌లెస్:	244

పత్తి కొనుగోళ్లకు సర్వం సిద్ధం

- కనీస మద్దతు ధర రూ.500 పెంపు
- మార్కెటింగ్ సంయుక్త సంచాలకుడు ఉప్పల శ్రీనివాస్



ముఖాముఖి

పత్తి కొనుగోలు సీజన్ ప్రారంభమైంది. ఇప్పటికే వరంగల్ ఎనుమాముల మార్కెట్‌కు అన్నదాతలు తెల్లబంగారంతో రావడం ప్రారంభమైంది. దీపావళి నాటికి విక్రయాలు జోరందుకుంటాయి. ఈ క్రమంలో మార్కెటింగ్ శాఖ పత్తి కొనుగోళ్లకు చేస్తున్న ఏర్పాట్లు ఎలా ఉన్నాయి? ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సీసీఐ ఎన్ని కొనుగోలు కేంద్రాలను నోటిఫై చేసింది? విపణికి సరకు ఏ మేరకు వస్తోంది? తదితర వివరాలతో వరంగల్ మార్కెటింగ్ శాఖ సంయుక్త సంచాలకుడు ఉప్పల శ్రీనివాస్‌తో సోమవారం 'ఈనాడు' ముఖాముఖి నిర్వహించింది. ఆ వివరాలు.

ఈనాడు, వరంగల్, ఎనుమాముల మార్కెట్, న్యూస్‌టుడే

? పత్తి రైతులు సరకుతో మార్కెట్‌కు రావడం ప్రారంభమైంది. ఈసారి కనీస మద్దతు ధర ఏ మేరకు పెరగనుంది?

✔ దసరా పండగ ముగియడంతో రైతులు పెద్ద మొత్తంలో పత్తి పంటతో వరంగల్ ఎనుమాముల మార్కెట్‌కు వస్తున్నారు. ఈసారి వారికి ధర లాభసాటిగా ఉంటుందని భావిస్తున్నాం. కనీస మద్దతు ధర రూ.500 పెరిగింది. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) క్వింటాకు మద్దతు ధర రూ.7521 చెల్లించనుంది.

? సీసీఐకు విక్రయిస్తే రైతుల ఖాతాల్లో ఎన్ని రోజుల్లో డబ్బులు జమ వుతాయి?

✔ రైతులు ఆధార్ అథెంటిఫికేన్ చేసుకుని ఉంటే కొనుగోలు కేంద్రాల వద్ద పని సులువు అవుతుంది. ఆధార్‌తో లింక్ అవడం వల్ల పత్తి విక్రయించిన రెండు మూడు పని దినాల్లో డబ్బులు ఖాతాల్లో జమవుతాయి.

? పత్తి రైతులకు మార్కెటింగ్ శాఖ అన్ని సౌకర్యాలు కల్పిస్తోందా?

✔ రైతులకు సాంకేతికతను చేరువ చేసేందుకు ఒక వాట్సప్ నెంబర్ (8897281111) కూడా మా శాఖ కొత్తగా ప్రవేశపెట్టింది. అందులోకి రైతులు వెళ్లి 'హాయ్' అని టైప్ చేస్తే కావాల్సిన సమాచారం వస్తుంది. ఏ యే జిన్నింగ్ మిల్లులో ఎంత మంది విక్రయాల కోసం వేచిచూస్తున్నారనే వివరాలు తెలుసుకోవచ్చు. ఎనుమాముల మార్కెట్‌లో ఇప్పటికే తాగునీటి వసతి కల్పించాం. విద్యుత్తు సరఫరా, యార్డులను శుభ్రం చేసి పెడుతున్నాం. సీసీఐ కొనుగోలు కేంద్రాలపై కూడా మా సిబ్బంది పర్యవేక్షణ ఉంటుంది. రైతులు పెద్ద ఎత్తున రావడానికి ముందే అన్ని ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నాయి. మా శాఖ మంత్రి, ఉన్నతాధికారులతో సమీక్ష సైతం పూర్తయ్యింది.

? సరకు రాక అంచనా గతేడాదికన్నా పెరిగిందా.. తగ్గిందా?

✔ ఇప్పటికే మేం సరకు రాకపై ఒక అంచనా రూపొందించుకున్నాం. గతేడాది 28.72 లక్షలు మెట్రిక్ టన్నులు వచ్చింది. ఈ ఏడాది సరకు రాక మరింత పెరుగుతుందని వ్యవసాయ శాఖ గణాంకాల ద్వారా స్పష్టమైంది. సుమారు 32.09 లక్షలు మెట్రిక్ టన్నుల పత్తి మార్కెట్‌కు వస్తుందని అంచనా వేశాం. ప్రస్తుతానికి ఎనుమాములకు కొద్ది మొత్తంలో మాత్రమే సరకు వస్తోంది. దీన్ని ప్రైవేటు వ్యాపారులు కొంటున్నారు. వరంగల్, సూర్యాపేట, నల్గొండ, ఆదిలాబాద్, ఖమ్మం, భువనగిరి తదితర జిల్లాల నుంచి అక్టోబరులో సరకు రావడం మొదలవుతుంది. నవంబరులో మిగతా జిల్లాల నుంచి పెద్ద మొత్తంలో వస్తుంది.

? మద్దతు ధర పెరిగిన నేపథ్యంలో రైతులు ప్రైవేటు వ్యాపారుల కన్నా సీసీఐకే ఎక్కువ పత్తిని విక్రయించే అవకాశం ఉంది. ఉమ్మడి జిల్లాలో ఎన్ని కేంద్రాలను నోటిఫై చేశారు?

✔ ఉమ్మడి జిల్లాలో 58 జిన్నింగ్ మిల్లులు ఉన్నాయి. ప్రస్తుతం 28 నోటిఫై చేశాం. త్వరలో వంద శాతం మిల్లులను అందుబాటులోకి తెస్తాం. రైతులు నేరుగా ఆ కేంద్రాలకు తీసుకొచ్చి పత్తిని విక్రయించవచ్చు. కనీస మద్దతు ధర కన్నా ఎక్కువ ధర వస్తే రైతులు బయట విక్రయించుకోవచ్చు. అప్పటి వరకు కొనుగోలు కేంద్రాలు కొనసాగుతాయి.

? పత్తిని మార్కెట్‌కు తీసుకొచ్చే క్రమంలో రైతులకు మీరిచ్చే సూచనలు ఏమిటి? తేమ శాతం ఎంత వరకు ఉంటే సీసీఐ కొనుగోలు చేస్తుంది?

✔ వచ్చేది చలికాలం కాబట్టి ఉదయం వేళ పత్తిపై తేమ ఎక్కువగా ఉంటుంది. అందుకే తొక్కడానికి సమయం తీసుకోవాలి. లేదంటే తేమ లోపల అలాగే ఉంటుంది.. రైతులు కోసిన వెంటనే తీసుకొస్తే మాయిశ్చర్ ఎక్కువగా నమోదవుతుంది. చాలా మంది రైతులు గ్రేడింగ్ చేయకుండా సరకును తీసుకురావడం వల్ల సీసీఐ వాళ్లు నిరాకరిస్తారు. గ్రేడింగ్ చేయడం మరవొద్దు. తేమ 8 నుంచి 12 శాతం వరకు ఉంటే సీసీఐ కొనుగోలు చేస్తుంది. కొనుగోలు కేంద్రాల్లో వే బ్రిడ్జ్ మీదున్న బరువును అన్నదాతలు సరిచూసుకోవాలి.

ఎంజీఎంలో అరుదైన శస్త్రచికిత్స

- మహిళా గొంతుపై థైరాయిడ్ గడ్డ తొలగింపు



బాధితురాలితో వైద్య బృందం

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో జనరల్ సర్జరీ విభాగం వైద్యులు అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి. ఓ మహిళ ప్రాణాలు కాపాడారు. వైద్యాధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలానికి చెందిన జన్ను వరలక్ష్మి(46) గొంతుపై 25 సె.మీ. వెడల్పుతో మెడ చుట్టూ ఆక్రమించి ఉన్న థైరాయిడ్ గడ్డతో పదేళ్లుగా ఇబ్బంది పడుతున్నారు. మెదడుకు రక్తప్రసారం చేసే నరాలను గడ్డ చుట్టుముట్టడంతో ఆహారం మింగలేకపోతున్నారు. ఎన్ని ఆసుపత్రులు తిరిగినా. హైదరాబాద్‌లోని పలు ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లినా.. ఫలితం కనిపించలేదు. చివరికి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రి వైద్యులు శస్త్రచికిత్స చేయడానికి రూ.5 లక్షల వరకు ఖర్చవుతుందన్నారు. కానీ ప్రాణాలకు హామీ ఇవ్వలేమని చెప్పారు. దిక్కుతోచని పరిస్థితుల్లో 10రోజుల క్రితం ఎంజీఎం ఆసుపత్రి జనరల్ సర్జరీ వైద్య విభాగానికి వచ్చారు. ప్రొఫెసర్ డా.శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో వైద్య బృందం పరీక్షించింది. అన్నిరకాల పరీక్షల అనంతరం బుధవారం సుమారు 5 గంటల పాటు శస్త్రచికిత్స నిర్వహించారు. బాధితురాలి గొంతుపై 25సె.మీ. వెడల్పులో ఉన్న థైరాయిడ్ గడ్డను విజయవంతంగా తొలగించారు. ఈ శస్త్రచికిత్సలో ప్రొఫెసర్ శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు డా. వినోద్‌కుమార్ దుస్సా, సీనియర్ రెసిడెంట్లు, పీజీ వైద్యులున్నారు. శస్త్రచికిత్స అనంతరం బాధితురాలు ఆరోగ్యంగా ఉందని వైద్యులు ధ్రువీకరించారు. కాగా ఇంత సంక్లిష్టమైన శస్త్రచికిత్సను ఎంజీఎం ఆసుపత్రిలో ఉచితంగా చేశారు. శస్త్ర చికిత్సలో పాల్గొన్న వైద్యులను ఎంజీఎం సూపరింటెండెంట్ డా.చిలుక మురళి అభినందించారు.

ఆర్టీసీ బస్సులకు అనుమతి లేదెందుకు?



వంతెన మీదుగా తిరుగుతున్న ప్రైవేటు వాహనాలు

హనుమకొండ నగరంలో ప్రధానమైన నయీంనగర్ నాలాపై వంతెన నిర్మాణం పూర్తైనా ఆర్టీసీ బస్సులు ఈ మార్గంలో తిరగడం లేదు. ఏటా వర్షాకాలం నాలా పొంగి కాలనీలను ముంచెత్తుతుండటంతో ప్రభుత్వం రూ.7.40 కోట్ల నిధులతో ఈ ఏడాది ఏప్రిల్ 5 నాలా విస్తరణ, వంతెన నిర్మాణం పనులకు శ్రీకారం చుట్టింది. దీంతో ఈ మార్గం గుండా రాకపోకలకు సాగించే ఆర్టీసీ బస్సులను దారి మళ్లించి నడిపారు. దీనికి అదనంగా టికెట్టుపై రూ.10 అదనంగా వసూలు చేస్తున్నారు. పనులు పూర్తై, ఆటోలు, స్కూల్ బస్సులు, ఇతర వాహనాలు తిరుగుతున్నా ఆర్టీసీ అధికారులు మాత్రం బస్సులను ములుగు రోడ్డు, పెద్దమ్మగడ్డ మీదుగానే తిప్పుతున్నారు. దీని కారణంగా ప్రయాణికులపై ఆర్థికంగా అదనపు భారం పడటమేకాకుండా.. కరీంనగర్, సిద్దిపేట, వేములవాడ, నిజామాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లేవారికి సమయం కూడా వృథా అవుతోంది. – న్యూస్‌టుడే, హనుమకొండ చౌరస్తా

అవిభక్త కవలలకు 22 ఏళ్లు

- సొంతగ్రామంలో పుట్టినరోజు వేడుకలు



కేక్ తినిపిస్తున్న వీణ-వాణి తల్లిదండ్రులు మురళి-నాగలక్ష్మి

దంతాలపల్లి, న్యూస్‌టుడే: దంతాలపల్లి మండలం బీరిశెట్టిగూడెం గ్రామానికి చెందిన అవిభక్త కవలలు వీణ, వాణి ఇరవై ఏళ్ల అనంతరం తమ సొంతింట్లో పుట్టిన రోజు వేడుకలను జరుపుకొన్నారు. మారగాని మురళి-నాగలక్ష్మి దంపతులకు రెండో సంతానంగా సూర్యాపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో వీరు జన్మించారు. 13 ఏళ్ల పాటు నీలోఫర్ ఆసుపత్రిలోనే ఉన్నారు. అనంతరం స్టేట్‌హోంకు తరలించారు. అప్పటి నుంచి అక్కడే పుట్టిన రోజు వేడుకలు జరిగాయి. స్టేట్‌హోం సూపరింటెండెంట్లు సఫియాఖాన్, సోమలక్ష్మితో కలిసి హైదరాబాద్ నుంచి బీరిశెట్టిగూడెం చేరుకోగా ఈసారి తమ ఇంట్లో బుధవారం 22వ జన్మదినాన్ని జరుపుకొన్నారు. బంధువులు, గ్రామస్థులు హాజరయ్యారు. తల్లిదండ్రులు మాట్లాడుతూ ప్రభుత్వం తమను ఆదుకోవాలని, పిల్లలతో కలిసి ప్రతి జన్మదినాన్ని జరుపుకొనేలా అవకామివ్వాలని కోరారు. ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో పలువురు వీరికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

మేడారం జాతరలో శాశ్వత ఏర్పాట్లకు కృషి



వనదేవతలకు కుటుంబసమేతంగా పూజలు నిర్వహిస్తున్న మంత్రి కొండా సురేఖ

మేడారం(తాడ్వాయి), న్యూస్‌టుడే: మా కుల దైవమైన సమ్మక్క, సారలమ్మను దర్శించుకోవడం సంతోషంగా ఉందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. మంత్రి కుటుంబసమేతంగా బుధవారం మేడారం వచ్చి తన మనవడి పుట్టువెంట్రుకలు సమర్పించారు. అమ్మవార్లకు ఎత్తుబెల్లం, నూతన వస్త్రాలు, ఒడి బియ్యం సమర్పించి పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత మహా జాతర సందర్భంగా కోరిన కోర్కెలు తీరినందుకు మేడారం వచ్చి మొక్కులు చెల్లించామన్నారు. మేడారాన్ని గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఎక్కువ అభివృద్ధి చేసిందన్నారు. ప్రస్తుతం కేంద్రంలో తమ ప్రభుత్వం ఉన్నట్లయితే జాతీయ హోదా దక్కి మరింత అభివృద్ధి చెందేదని తెలిపారు. రాబోయే జాతరనాటికి భక్తులకు అన్ని రకాల శాశ్వత ఏర్పాట్లు చేయించేందుకు కృషి చేస్తామన్నారు. రాష్ట్రం ఆర్థికాభివృద్ధి సాధించి ప్రజలకు మేలు జరగాలని దేవతలను వేడుకోవడం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు, డీఎఫ్‌వో రాహుల్‌కిషన్ జాదవ్, దేవాదాయశాఖ డీసీ శ్రీకాంత్‌రావు, తహసీల్దారు రవీందర్, ఎంపీవో శ్రీధర్‌రావు, ఆలయ కార్యనిర్వహణాధికారి రాజేంద్రం, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, తదితరులు పాల్గొన్నారు.

బమ్మెర పర్యాటకాభివృద్ధి పనులపై నీలినీడలు

పాలకుర్తి, న్యూస్‌టుడే

జనగామ జిల్లాలోని బమ్మెర, వల్మిడి, సోమేశ్వరాలయం, పాలకుర్తికి తరాల చరిత్ర ఉంది. ఇక్కడ ఎందరో మహానుభావులు, కవులు, కళాకారులు, పోరాటయోధులు పురుడుపోసుకున్నారు. అంతటి ప్రాధాన్యత ఉన్న ఈ ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని గత ప్రభుత్వం 2017లో సుమారు రూ.23 కోట్లు మంజూరు చేయగా, పనులు చేపట్టారు. వల్మిడి, పాలకుర్తిలో 90 శాతం మేర నిర్మాణాలు పూర్తి కాగా, బమ్మెరలో మాత్రం ఏళ్లుగా ఆగుతూ. . సాగుతూ.. వస్తున్నాయి.

40 శాతం మేర నిర్మాణ దశలోనే..



పురోగతి కనిపించని స్మారక కేంద్రం

బమ్మెరలో సహజ కవి పోతన చారిత్రక ఆనవాళ్లు ఉన్న ప్రదేశంలోనే సుమారు 4 ఎకరాల స్థలంలో పర్యాటకాభివృద్ధి పనులు చేపట్టారు. 2019లో పోతన స్మృతివనంతోపాటు గ్రంథాలయం, అక్షరభ్యాస కేంద్రం, విడిది కేంద్రాలు, సమాధి, బావి పునరుద్ధరణ, ఆడిటోరియం తదితరాలు చేపట్టగా, అవి ఇంకా నిర్మాణ దశలోనే మగ్గుతున్నాయి. అలాగే రూ.3 కోట్లతో పోతన కాంస్య విగ్రహం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. అయితే కొన్నాళ్లుగా నిలిచిన పనులపై స్థానిక ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, కలెక్టర్ రిజ్వాన్‌బాషాలు ఇతర శాఖల అధికారులతో పలుమార్లు సమీక్షించారు. చేసిన వాటికి బిల్లులు రాకపోవడమే ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఇంకా 40 శాతం మేర పనులు పెండింగ్‌లో ఉన్నాయి. బమ్మెరను అభివృద్ధి చేస్తే పర్యాటకుల రాకతో ఆదాయం పెరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే సోమేశ్వరాలయం ఆ ఖ్యాతిని దక్కించుకోగా, అక్కడి నుంచి వచ్చే భక్తులు బమ్మెర, వల్మిడి ప్రాంతాలను సైతం సందర్శిస్తున్నారు. పెండింగ్ పనులు పూర్తి చేసి సరైన వసతులు, సౌకర్యాలు మెరుగుపరచాల్సి ఉంది.



అసంపూర్తిగా ఆడిటోరియం నిర్మాణం..

పర్యాటక కేంద్రాలుగా విరాజిల్లేలా కృషి..

- మామిడాల యశస్విని రెడ్డి, పాలకుర్తి ఎమ్మెల్యే

గత గుత్తేదారుల నిర్లక్ష్యం వల్లే పర్యాటకాభివృద్ధి పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. పనుల పురోగతి, ప్రతిపాదనలను ప్రభుత్వానికి నివేదించి, త్వరితగతిన జరిగేలా చర్యలు తీసుకుంటాం. రానున్న రోజుల్లో పాలకుర్తి, బమ్మెర, వల్మిడి ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా విరాజిల్లేలా కృషి చేస్తా.

'ఇలాగైతే కళాశాలలు నిర్వహించలేం'

వరంగల్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: మూడు సంవత్సరాలుగా ప్రభుత్వం ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల విద్యార్థులకు బోధన రుసుము, ఉపకార వేతనాలు చెల్లించకపోవడంతో, ఇలాగైతే తాము కళాశాలలు నిర్వహించలేమని తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్య సంఘం (టీడీపీఎంఏ) నాయకులు పేర్కొన్నారు. సంఘం ఆధ్వర్యంలో మూణ్రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా కళాశాలలు బంద్ చేసి, నిరవధిక సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ బుధవారం పార్కు నుంచి హనుమకొండ కలెక్టరేట్ వరకు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. బోధనారుసుం మంజూరు చేయకపోతే కళాశాలలు నిర్వహించలేక యాజమాన్యాలు మూసివేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం భవనాల అద్దె, అధ్యాపకులు, సిబ్బందికి వేతనాలు చెల్లించలేని పరిస్థితిలో ఉన్నామన్నారు. ఏడాది కిందట విడుదల చేసిన టోకెన్ నెంబర్ల సంబంధించిన రూ.600 కోట్ల బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేయూ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.ఉపేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.ప్రభాకర్ రెడ్డి, కోశాధికారి జి.వేణుమాధవ్, టీడీపీఎంఏ సభ్యులు శ్రీధర్‌రావు, రవీంద్రనాథ్, వెంకట్, జిల్లా కోఆర్డినేటర్ వేణుమాధవ్ పాల్గొన్నారు.

సఖి సేవలు వినియోగించుకోండి

లేబర్‌కాలనీ, న్యూస్‌టుడే: వరంగల్ క్రిస్టియన్ కాలనీలో మహిళలకు సఖి కేంద్రం వారు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సఖి సెంటర్ ప్రతినిధులు తిరుమల, స్వప్న ఆధ్వర్యంలో గోడప్రతులు ఆవిష్కరించారు. మహిళలు, బాలికల రక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ఆపద వేళ 181 నంబరుకు ఫోన్ చేసి సేవలు వినియోగించుకోవాలన్నారు. ఆర్పీలు, స్థానిక మహిళా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

స్థలాల క్రమబద్ధీకరణకు నిరీక్షణ!

● గ్రేటర్‌లో 79 వేల అపరిష్కృత ఎల్ఆర్ఎస్ అర్జీలు

కార్పొరేషన్, న్యూస్‌టుడే

నగరంలో ఎల్ఆర్ఎస్(లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం) అర్జీల పరిష్కారంలో పురోగతి కనిపించడం లేదు. పది, 20 వేలు కాదు.. ఏకంగా 79 వేల దరఖాస్తులు పరిశీలన చేయాల్సి ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చి.. రెండు నెలలవుతున్నా..! చూద్దాం.. చేద్దామనే ధోరణి తప్పా క్షేత్రస్థాయిలో కదలిక లేదు. దీంతో దరఖాస్తుదారులు గ్రేటర్ వరంగల్, కాజీపేట, కాశిబుగ్గ సర్కిల్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా పరిశీలిస్తే ఎల్ఆర్ఎస్ అర్జీల పరిశీలనలో గ్రేటర్ వరంగల్ వెనుకంజలో ఉంది. పలుమార్లు రాష్ట్ర పురపాలక శాఖ అధికారులు, రాష్ట్ర టౌన్ అండ్ కంట్రీప్లానింగ్ డైరెక్టర్(డీటీసీపీ) సమీక్షించినా.. పురోగతి లేదు. దీనిని దృష్టిలో ఉంచుకొని నగరంలోని 66 డివిజన్ల వార్డు అధికారులను భాగస్వాములను చేసేందుకు నిర్ణయించారు. బుధవారం మేయర్ గుండు సుధారాణి పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, వార్డు అధికారులతో సమావేశమయ్యారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన ముమ్మరం చేసేందుకు తగిన ప్రణాళిక రూపొందించారు. సమావేశంలో అదనపు కమిషనర్ రాజేందర్‌రెడ్డి, సెక్రటరీ విజయలక్ష్మి, ఉప కమిషనర్ ప్రసన్నరాణి, ఇన్‌ఛార్జి సిటీప్లానర్ రవీందర్ రాడేకర్ తదితరులు పాల్గొన్నారు.

99 వేల దరఖాస్తులు

☛ 2019-20లో అప్పటి ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ పథకం అమలులోకి తెచ్చింది. 2020 జనవరి వరకు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. గ్రేటర్ వరంగల్ పరిధిలో 99 వేల పైచిలుకు అర్జీలు వచ్చాయి. హైదరాబాద్ జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ తర్వాత వరంగల్ జీడబ్ల్యూఎంసీ పరిధిలోనే ఎక్కువ వచ్చాయి. న్యాయపరమైన అడ్డంకులతో నాలుగేళ్ల పాటు ప్రక్రియ ముందుకు సాగలేదు. ఎల్ఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై కాంగ్రెస్ ప్రభుత్వం రెండు నెలల క్రితం మరోసారి ఆదేశించింది.

☛ వరంగల్ నగర పరిధిలో 99 వేల దరఖాస్తుల్లో గాను 20 వేలకు సంబంధించిన ప్రక్రియ కొనసాగుతోంది. మరో 79 వేలు పెండింగ్‌లో ఉన్నాయి.

☛ ఇప్పటి వరకు ఎల్ఆర్ఎస్ ప్రొసీడింగ్ కాపీలు 500-600 మంది దరఖాస్తుదారులకు ఇచ్చారు.



వార్డు అధికారులతో సమావేశమైన మేయర్ సుధారాణి

వార్డు అధికారులకు శిక్షణ

● ఎల్ఆర్ఎస్ అర్జీల పరిష్కారం వేగవంతం చేసేందుకు నగరంలోని 66 డివిజన్ల వార్డు అధికారులను రంగంలోకి దింపుతున్నారు. మొబైల్ యాప్ ద్వారా క్షేత్రస్థాయి పరిశీలన ఇతర అంశాలపై బుధవారం బల్దియా సమావేశ మందిరంలో శిక్షణ ఇచ్చారు. దృశ్యరూప ప్రదర్శన ద్వారా టౌన్‌ప్లానింగ్ అధికారులు సందేహాలు నివృత్తి చేశారు.

● ఒక్కో వార్డు అధికారి వారంలో 1400-1500 దరఖాస్తులు పరిశీలించాలి. వెంటనే ప్రత్యేక మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. వివాదాలకు తావులేకుండా ఎల్ఆర్ఎస్ అర్జీలు పరిష్కరించాలని మేయర్ గుండు సుధారాణి కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా

వరంగల్: 99635 59929, 98484 09191, 99896 42307, 97053 46535 (10 AM TO 1 PM)

ఖిలావరంగల్, న్యూస్‌టుడే: చింతల్ ఎల్బీనగర్ కింది భాగంలో ఉన్న పుప్పాలగుట్ట శ్మశాన వాటికలో చెత్త, వ్యర్థాలు పేరుకుపోవడంతో అంతిమయాత్రకు ఇబ్బందులు తప్పడం లేదు. - రాజ్‌కుమార్, స్థానికుడు

సమాధానం: రెండురోజుల్లో శుభ్రం చేయిస్తాం. - అఖిల్, 36వ డివిజన్ జవాను

కార్పొరేషన్, న్యూస్‌టుడే: వరంగల్ ప్రాంతం 11వ డివిజన్ రంగంపేట పోలీసుస్టేషన్ కూడలి ఎదురు గల్లీలో పది రోజులుగా మురుగు కాలువలు తీయడం లేదు. - ఎండీ.షరీఫ్, రంగంపేట

సమాధానం: త్వరలో తీయిస్తాం. - శ్యాంరాజ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

పర్వతగిరి(వర్ధన్నపేట): పర్వతగిరి మండల కేంద్రం ప్రధాన కూడలిలోని నెక్కొండ రోడ్డు సమీపంలో విచ్చలవిడిగా గుడుంబా విక్రయిస్తున్నారు. దీంతో కాలనీవాసులు, బాటసారులు ఇబ్బందులు పడుతున్నారు. - వెంకట్, పర్వతగిరి.

సమాధానం: అమ్మకాల నివారణకు చర్యలు చేపడుతున్నాం. ఇటీవల పర్వతగిరికి చెందిన ముగ్గురిపై కేసు నమోదు చేశాం. - సరిత, ఆబ్కారీశాఖ ఎస్సై, వర్ధన్నపేట

వీధి దీపాలకు మరమ్మతులు



బొందలకుంటలో బాగు చేస్తున్న సిబ్బంది

కార్పొరేషన్: వరంగల్ నగరంలోని పలు సమస్యలను 'మేమున్నాం మీకుతోడుగా' ఈనాడు అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. స్పందన లభించింది. 25వ డివిజన్ బొందలకుంటలో వీధిదీపాన్ని బుధవారం బల్దియా సిబ్బంది బాగు చేశారు. ఇదే రోడ్డులో మరో రెండు వీధి దీపాలకు మరమ్మతులు చేపట్టారు.

మురుగు కాలువ శుభ్రం

కార్పొరేషన్: వరంగల్ ప్రాంతం 29వ డివిజన్ రామన్నపేట, పాపయ్యపేట గల్లీలో మురుగు కాలువలు శుభ్రం చేసినట్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్యాంరాజ్ తెలిపారు.

నకిలీ విత్తనాలతో మోసపోయిన రైతు.. గుండెపోటుతో మృతి



నర్సయ్య (పాతచిత్రం)

పర్వతగిరి(వరంగల్), న్యూస్‌టుడే: నకిలీ విత్తనాలతో మోసపోయిన రైతు మనోవేదనకు గురై గుండెపోటుతో మృతిచెందిన ఘటన వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం చౌటపల్లి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటపల్లి గ్రామానికి చెందిన గుర్రం నర్సయ్య(62) తనకున్న ఎకరం భూమితో పాటు మరో అయిదెకరాలు కౌలుకు తీసుకొని వరి సాగు చేశారు. గ్రామానికి చెందిన మరో 12 మంది రైతులతో కలిసి హరియాణా రాష్ట్రానికి చెందిన సూపర్ సీడ్ కంపెనీ వరి విత్తనాలను పర్వతగిరిలోని ఓ ఫెర్టిలైజర్ దుకాణంలో కొనుగోలు చేశారు. పొట్టదశలో ఉన్న వరి ఎదుగుదల లేకపోవడం.. మూడురకాల వరి కంకులు(గొలుసులు) రావడంతో నకిలీ విత్తనాలు కొని మోసపోయానని గుర్తించారు. వెంటనే దుకాణ యజమాని దృష్టికి తీసుకెళ్లి మండల వ్యవసాయ అధికారి ప్రశాంత్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. రైతుల ఫిర్యాదు మేరకు క్షేత్ర స్థాయిలో పంటలు పరిశీలించిన మండల వ్యవసాయ అధికారులు విత్తన లోపంతో నష్టం జరిగినట్లు గుర్తించారు. 'పంట దిగుబడి రాదని.. పెట్టుబడి డబ్బులు వచ్చేదెలా? కౌలు కట్టేదెలా?' అంటూ మూడురోజులుగా నర్సయ్య మనోవేదనకు గురయ్యాడు. ఈ విషయం గురించి పదేపదే తోటి రైతులు, కుటుంబ సభ్యులకు చెబుతూ దిగులు చెందారు. మంగళవారం రాత్రి పడుకున్న నర్సయ్యను బుధవారం తెల్లవారుజామున కుటుంబ సభ్యులు లేపడానికి ప్రయత్నించగా.. అప్పటికే ఆయన గుండెపోటుతో మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

హడావుడిగా ఒప్పందాలు..

రైతు నర్సయ్య గుండెపోటుతో మృతిచెందిన విషయం తెలుసుకున్న వ్యాపారులు, వ్యవసాయ అధికారులు హడావుడిగా సూపర్ సీడ్ విత్తనాలు కొనుగోలు చేసిన రైతులతో వర్ధన్నపేట మండలం ఉప్పరపల్లి రైతువేదిక సమీపంలో సమావేశమయ్యారు. ఎట్టకేలకు ఎకరాకు రూ. 9వేల చొప్పున పరిహారం అందించేలా ఒప్పందం కుదుర్చుకొని పత్రం రాసుకున్నట్లు సమాచారం.

● ఈ విషయంపై పర్వతగిరి మండల వ్యవసాయ అధికారి ప్రశాంత్‌కుమార్‌ను వివరణ కోరగా.. రైతులు ఫిర్యాదు చేసిన విషయం వాస్తమేనన్నారు. నకిలీ విత్తనాలపై పూర్తిస్థాయి నివేదికను ఉన్నతాధికారులకు పంపించి వారి సూచనలతో తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

నాణ్యమైన పత్తికే మద్దతు ధర

ఎనుమాముల మార్కెట్, న్యూస్‌టుడే: మద్దతు ధర రావాలంటే.. నాణ్యమైన తేమలేని పత్తిని మార్కెట్‌కు తీసుకురావాలని ఎనుమాముల మార్కెట్ కార్యదర్శి పి.నిర్మల బుధవారం ఓ ప్రకటనలో రైతులకు సూచించారు. బరువు పెరిగేందుకు పత్తిపై నీరు చల్లకూడదన్నారు. నీరు చల్లిన పత్తి రంగుమారి నాణ్యత దెబ్బతింటుందని, పత్తి గింజలు బూజు పట్టే ప్రమాదముందన్నారు. పత్తిలో అపరిపక్వమైన కాయను వేరు చేయాలని, నాణ్యతలేని కొడి పత్తిని మంచి పత్తితో కలపకుండా మార్కెట్‌కు తీసుకురావాలన్నారు.

బెటాలియన్‌లో క్రీడా పోటీలు ప్రారంభం



టాస్ వేస్తున్న కమాండెంట్ రామ్‌ప్రకాశ్

మామునూరు, న్యూస్‌టుడే: మామునూరు టీజీఎస్పీ 4వ బెటాలియన్‌లో ఇంటర్ కాయ్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2024 పోటీలను కమాండెంట్ బి.రామ్ ప్రకాశ్ బుధవారం ప్రారంభించారు. క్రికెట్, వాలీబాల్, చెస్, క్యారమ్స్ తదితర విభాగాల్లో మూడురోజుల పాటు పోటీలు జరగనున్నాయి. అసిస్టెంట్ కమాండెంట్లు కృష్ణప్రసాద్, శ్రీనివాసరావు, వీరన్న, ఆర్ఐలు ఉన్నారు.

నరకాసుర వధకు ఏర్పాట్లు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: ఈ నెల 30న ఉర్సుగుట్ట రంగలీలా మైదానంలో జరిగే నరకాసుర వధకు వరంగల్ మహా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేస్తామని మేయర్ గుండు సుధారాణి తెలిపారు. బుధవారం సాయంత్రం నరకాసుర వధ ఉత్సవ కమిటీ ప్రతినిధులు మేయర్‌ను ఉత్సవాలకు ఆహ్వానించారు. ఉత్సవాన్ని తిలకించేందుకు 20- 30 వేల మంది వస్తారని, లైటింగ్, మైకు, ఇతర ఏర్పాట్లు చేయాలని కార్పొరేటర్ మరుపల్ల రవి కోరారు. కమిటీ నాయకులు రామ్మూర్తి, గౌతమ్, రాజు, శివ, నరిసింహ, రాము తదితరులున్నారు.

విద్యార్థులకు అవకాశం

విద్యానగర్, న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయ పరిధిలోని డిగ్రీ, పీజీ బ్యాక్‌లాగ్ విద్యార్థులకు రాత, ప్రయోగ, సెమినార్ తదితర పరీక్షలు 2024-25 విద్యా సంవత్సరం కాలపరిమితికి సంబంధించి క్లియర్ చేయడానికి అవకాశం కల్పించారు. ఈ మేరకు రిజిస్ట్రార్ ఆచార్య పి. మల్లారెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేసారు. విశ్వవిద్యాలయ పరిధిలోని కళాశాలల విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, వీటికి సంబంధించిన పరీక్షా రుసుం వివరాలు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌లో చూడవచ్చని పేర్కొన్నారు.

ఆర్థిక సాయం

గీసుకొండ, న్యూస్‌టుడే: మండలంలోని ఊకల్ హవేలీలోని నిరుపేద కుటుంబానికి చెందిన శ్రీరాముల వనిత జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఇటీవల ఎంబీబీఎస్ సీటు సాధించింది. గ్రామానికి చెందిన కక్కెర్ల నర్సింహస్వామి గౌడ్ ఆమె చదువు కోసం బుధవారం రూ. 15 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో నాగేంద్రస్వామి ఆలయ పూజారి సుదర్శనాచార్యులు పాల్గొన్నారు.

మండలానికి ఎన్ఐఆర్‌డీ పీజీ విద్యార్థుల రాక



గీసుకొండ, న్యూస్‌టుడే: హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీ రాజ్ (ఎన్ఐఆర్‌డీ)లో పీజీ మొదటి సంవత్సరం విద్యార్థులు మండలంలోని జాతీయ ఆదర్శ గ్రామమైన గంగదేవిపల్లి, జాతీయ ఉత్తమ గ్రామమైన మరియపురంతో పాటు కోనాయమాకులలో బుధవారం పర్యటించారు. ఘనా, బంగ్లాదేశ్ కేరళ, ఆంధ్రప్రదేశ్, బిహార్, ఝార్ఖండ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, ఒడిస్సా, మహారాష్ట్రకు చెందిన 21 మంది విద్యార్థులు ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా హాజరయ్యారు.

రైలు కిందపడి ఆత్మహత్య

గిర్మాజీపేట, న్యూస్‌టుడే: వరంగల్- కాజీపేట స్టేషన్ల మధ్య బుధవారం సాయంత్రం రైలు కిందపడి గుర్తుతెలియని ఒకరు ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్పీ పోలీసులు తెలిపారు. మృతుడికి 30- 35 ఏళ్ల వయసు, 5.6 అడుగుల ఎత్తు, చామనఛాయ రంగు ఉన్నారని, ఖాకీ ప్యాంటు, రంగుల షర్టు ధరించినట్లు వెల్లడించారు. అతడి కుడిచేతిపై 'అన్న' అని తెలుగులో, ఎడమ చేతిపై 'ప్రభ' అని ఆంగ్లంలో రాసి ఉందన్నారు. ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో మృతదేహాన్ని ఎంజీఎం ఆసుపత్రిలో భద్రపర్చినట్లు వెల్లడించారు. వివరాలు తెలిసినవారు 97017 47014, 87126 58585 సంప్రదించాలన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి..

రంగశాయిపేట, న్యూస్‌టుడే: ఆర్థికంగా చితికిపోయిన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. మిల్స్‌కాలనీ సీఐ వెంకటరత్నం తెలిపిన వివరాల ప్రకారం.. శివనగర్ ఏసీరెడ్డినగర్‌కు చెందిన పప్పు సంతోష్(30) కూలి పనిచేస్తుంటారు. మూడేళ్ల క్రితం వివాహం కాగా కుమారుడు ఉన్నాడు. కొంతకాలంగా కుటుంబ పోషణ భారం కావడంతో పాటు అనారోగ్య సమస్యలు తలెత్తాయి. ఈక్రమంలో అప్పులు పెరిగి.. వాటిని తీర్చే మార్గం కనిపించక బుధవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. భార్య రమ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

వ్యవసాయ యువ శాస్త్రవేత్త హఠాన్మరణం



సందీప్ (పాతచిత్రం)

వరంగల్ వ్యవసాయం, న్యూస్‌టుడే: వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం పత్తి విభాగంలో పనిచేస్తున్న యువ శాస్త్రవేత్త డా.సిలివేరు సందీప్ (35) బుధవారం హఠాన్మరణం చెందారు. వరంగల్ పోతననగర్‌కు చెందిన ఆయన 2018లో వ్యవసాయ శాస్త్రవేత్తగా వికారాబాద్ జిల్లా తాండూరు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో చేరారు. తెలంగాణ కంది-3 రకాన్ని అభివృద్ధి చేశారు. గతేడాది వరంగల్ ప్రాంతీయ పరిశోధన కేంద్రానికి బదిలీపై వచ్చారు. బుధవారం ఉదయం 10 గంటలకు ఇంట్లో శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతుండటంతో కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయనకు భార్య, మూడు, ఆరేళ్ల వయస్సు గల ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సందీప్ మృతికి వరంగల్ వ్యవసాయ పరిశోధన కేంద్రం ఏడీఆర్ డా.ఆర్.ఉమారెడ్డి, వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డా.బలరాం, పలువురు శాస్త్రవేత్తలు, ఉద్యోగులు సంతాపం తెలిపారు.

రాయితీ బియ్యం స్వాధీనం

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు అందించాల్సిన బియ్యం అక్రమంగా నిల్వ ఉంచిన కేంద్రంపై బుధవారం దాడులు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ.మధుసూదన్ తెలిపారు. వరంగల్ జిల్లా నెక్కొండ మండలం అప్పాలరావుపేట గ్రామానికి చెందిన జి.ఆనందం అదే మండలంలోని పలు గ్రామాల్లో లబ్ధిదారుల నుంచి రేషన్ బియ్యాన్ని సేకరించి, ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో తనిఖీ చేశారు. రూ.57 వేల విలువ చేసే 22 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకొన్నారు. కేసు నమోదు, విచారణ కోసం నెక్కొండ పోలీసులకు అప్పగించామని ఏసీపీ తెలిపారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ బాబులాల్, సిబ్బంది పాల్గొన్నారు.

గుట్కా పొట్లాల పట్టివేత

నర్సంపేట, న్యూస్‌టుడే: నర్సంపేటలో బుధవారం నాలుగు కిరాణా దుకాణాలలో పోలీసులు తనిఖీలు చేశారు. ఓ కిరాణం దుకాణంలో రూ.10,700ల విలువైన గుట్కా పొట్లాలను పట్టుకున్నారు. సీఐ రమణమూర్తి, ఎస్సై రవికుమార్ ఆధ్వర్యంలో పట్టణంలో వేర్వేరు ప్రదేశాల్లోని దుకాణాల్లో తనిఖీలు చేశారు. యజమాని మనోహర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

దుగ్గొండి: మండలంలోని గిర్నిబావిలో లావణ్య కిరాణంలో గుట్కాలు విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో బుధవారం తనిఖీ చేసి రూ.7600 విలువైన గుట్కాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. కిరాణా దుకాణం యజమాని భాస్కర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఎన్పీఆర్ నగర్‌లో చోరీ

మట్టెవాడ, న్యూస్‌టుడే: దేశాయిపేట శివారులోని ఎన్పీఆర్‌నగర్‌లో నివాసం ఉండే గృహిణి హీనా ఇంట్లో బుధవారం గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఇంట్లో ఎవరూలేని సమయంలో బంగారు ఆభరణాలు అపహరించారు. బాధితురాలు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ప్రాథమిక సమాచారం మేరకు దర్యాప్తు చేస్తున్నామని, ఇంకా ఫిర్యాదు అందలేని ఇంతేజార్‌గంజ్ ఠాణా సీఐ షుకూర్ తెలిపారు.

18శాతం తేమ ఉన్నా.. పత్తి కొనాలని వినతి



ఎనుమాముల మార్కెట్, న్యూస్‌టుడే: భారత పత్తి సంస్థ (సీసీఐ) పత్తిలో 12 శాతం కన్నా తక్కువ ఉంటేనే ప్రభుత్వ కనీస మద్దతు ధర రూ.7,521 చెల్లించనున్నట్లు ప్రకటించిందని.. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో 18శాతం ఉన్నా పత్తి కొనుగోలు చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణికి బుధవారం వినతిపత్రం అందజేశారు. అకాల వర్షాల కారణంగా పత్తికి తెగుళ్లు సోకి దిగుబడి తగ్గుతుందన్నారు. రైతులకు గిట్టుబాటు ధర వచ్చేలా నిర్ణీత తేమశాతాన్ని పెంచాలన్నారు. సోమిడి శ్రీనివాస్, రాచర్ల బాలరాజు, చిర్ర సూరి తదితరులు పాల్గొన్నారు.

చదివిన బడిలో కొలువు



ప్రధానోపాధ్యాయుడికి నియామక పత్రం అందిస్తున్న వెంకటేశ్వర్లు

ఖానాపురం, న్యూస్‌టుడే: పుట్టిన ఊరు చదువుకున్న బడిలో ఉద్యోగం సంపాదించాడు బుధరావుపేటకు చెందిన వెంకటేశ్వర్లు. ఏడో తరగతి నుంచి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివాడు. ప్రాథమిక విద్యాభ్యాసం అదే గ్రామంలోని శ్రీహర్ష పాఠశాలలో పూర్తి చేశాడు. బీఎడ్ జయముఖి కళాశాలలో చదువుతూ బుధరావుపేట ప్రభుత్వ పాఠశాలలో టీచింగ్ ప్రాక్టీస్ చేశారు. సాంఘిక ఉపాధ్యాయుడిగా బుధరావుపేట ఉన్నత పాఠశాలలకు రావడం సంతోషంగా ఉందని ఈనాడుతో పేర్కొన్నాడు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి

వర్ధన్నపేట, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రజలకు వైద్యులు, సిబ్బంది మెరుగైన సేవలందించాలని పాలనాధికారి సత్యశారద సూచించారు. వర్ధన్నపేట సీహెచ్‌సీని బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యులు, సిబ్బంది హాజరు రిజిస్టరు తనిఖీ చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారితో మాట్లాడి సేవల గురించి ఆరా తీశారు. అనంతరం మందుల నిల్వ వివరాలను సిబ్బందిని అడగ్గా.. సరైన సమాధానం చెప్పకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పలువురు వైద్యులను మందలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఆసుపత్రిలో ప్రత్యేకంగా ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేస్తానని, వాటిని తానే స్వయంగా పరిశీలిస్తానన్నారు. ఆసుపత్రి ఎదుట ఏర్పాటు చేసిన దుకాణాలను తొలగించాలని ఆదేశించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ రామ్మూర్తి, తహసీల్దార్ విజయసాగర్, కమిషనర్ జోనా, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సభల్లోనే కమిటీలు ఏర్పాటు చేయండి

రాయపర్తి, న్యూస్‌టుడే: గ్రామస్థాయిలో అధికారుల సమక్షంలో గ్రామ సభలను ఏర్పాటు చేసి ఇందిరమ్మ కమిటీలను అధికారికంగా నియమించాలని భారాస నాయకులు డిమాండ్ చేశారు. ఏకపక్షంగా నియమించిన కమిటీల ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించవద్దని అధికారులను కోరారు. బుధవారం తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. నాయకులు సుధీర్ రెడ్డి, అనిమిరెడ్డి, కుమార్‌గౌడ్, మధు, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాల బకాయిలతో ఇబ్బందులు



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శరత్

శివనగర్, న్యూస్‌టుడే: మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. బుధవారం శివనగర్ తమ్మెర భవన్‌లోని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన వామపక్ష విద్యార్థి సంఘాల సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శరత్, ఏఐఎస్‌బీ జిల్లా కో-కన్వీనర్ పెండ్యాల సతీష్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి ఎండీ మిశ్రాన్ సుల్తానా మాట్లాడారు. ఫీజు రియంబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు రూ.కోట్లలో బకాయి పడటం వల్ల విద్యా సంస్థల యాజమాన్యాలు నిరవధికంగా బంద్ పాటిస్తున్నాయని వివరించారు. ఫలితంగా విద్యార్థులు చదువుకు దూరమయ్యే పరిస్థితి నెలకొందన్నారు.

బాలిక అదృశ్యం.. కేసు నమోదు

నల్లబెల్లి, న్యూస్‌టుడే: మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక బుధవారం అదృశ్యమైనట్లు ఎస్సై ప్రశాంత్ బాబు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఈ నెల 11న చరవాణిలో మిత్రుడితో మాట్లాడుతుండగా.. తండ్రి మందలించడంతో మరుసటి రోజు ఉదయం నుంచి బాలిక కనిపించకపోవడంతో బుధవారం పోలీసుస్టేషన్‌లో తండ్రి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

జ్యోతిబా ఫులే చిత్రపటానికి పుష్పాభిషేకం



నర్సంపేట, న్యూస్‌టుడే: రాష్ట్రంలో సమగ్ర కులగణన ప్రక్రియ చేపట్టేందుకు ప్రభుత్వం జీవో విడుదల చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం బీసీ సంఘం జిల్లా నాయకుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆ సంఘం నాయకులు జ్యోతిబా పులే చిత్రపటానికి పూలమాల వేసి పుష్పాభిషేకం చేశారు. కామారెడ్డి సభలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు సమగ్ర కుల సర్వే ప్రక్రియ ప్రారంభించడంతో హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు రజనీకాంత్, బిక్షపతి, శ్యాంకుమార్, ఆనంద్‌కుమార్, రమేశ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా కానిస్టేబుల్ మృతికి సంతాపం

నల్లబెల్లి, న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదంలో మృతి చెందిన కానిస్టేబుల్ ధరణి మృతి తీరనిలోటని తెలంగాణ దళిత విద్యావంతుల వేదిక జిల్లా కార్యదర్శి సాంబయ్య అన్నారు. బుధవారం ప్రజా సంఘాల నాయకుల ఆధ్వర్యంలో నల్లబెల్లిలో ఆమె మృతి పట్ల సంతాపం తెలిపారు. ప్రకాశ్, మల్లయ్య, బద్రయ్య, మల్లేశం పాల్గొన్నారు.

నర్సంపేట నియోజకవర్గం

చేప పిల్లల పంపిణీ

చెన్నారావుపేట, న్యూస్‌టుడే: చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని ముదిరాజ్ కులస్థులు సద్వినియోగం చేసుకోవాలని నర్సంపేట మార్కెట్ ఛైర్మన్ పాల్వాయి శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కోపాకుల చెరువులో 96 వేల చేపపిల్లలను వదిలారు. ముదిరాజ్‌లు ఆర్థికంగా బలోపేతం కావాలని కోరారు. గోపాల్‌నాయక్, వెంకటరెడ్డి, వీరారెడ్డి, విజేందర్, రాజు, రమేశ్, కిరణ్ పాల్గొన్నారు.

విద్యుత్తు అధికారుల పొలంబాట

దుగ్గొండి, న్యూస్‌టుడే: వ్యవసాయ క్షేత్రంలో రైతుల విద్యుత్తు సమస్యలను అడిగి తెలుసుకొని పరిష్కరించేందుకు పొలంబాట కార్యక్రమం తోడ్పడుతోందని ఎన్పీడీసీఎల్ ఎస్ఈ మధుసూదన్‌రావు అన్నారు. మండలంలోని తొగర్రాయిలో ఏర్పాటు చేసిన విద్యుత్తు శాఖ పొలంబాట కార్యక్రమంలో ఎస్ఈ మధుసూదన్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వినియోగదారులు విద్యుత్తు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో డీఈ శ్రీధర్, ఏడీఈ లక్ష్మణ్, ఏఈలు పాల్గొన్నారు.

దోమల నిర్మూలనపై అవగాహన

నాగుర్లపల్లి(నర్సంపేట(గ్రామీణం)): మలేరియా, టైఫాయిడ్ తదితర వ్యాధులకు కారణమైన దోమలను లార్వా దశలోనే నిర్మూలించాలని వైద్య ఆరోగ్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నాగయ్య తెలిపారు. మండలంలోని నాగుర్లపల్లిలో ఆకస్మికంగా సందర్శించి పలు కాలనీలను పరిశీలించారు. కాలానుగుణ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సిబ్బంది పలు ఇళ్లలో దోమల మందు పిచికారీ చేసి మురుగు నీటిని తొలగించారు. సబ్ యూనిట్ మలేరియా అధికారి నంద, అజయ్‌కుమార్, మురళి పాల్గొన్నారు.

వినియోగదారుల సమస్యలు పరిష్కరిస్తాం



మాట్లాడుతున్న వేణుగోపాలచారి

దుగ్గొండి, న్యూస్‌టుడే: వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తామని విద్యుత్తు వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక ఛైర్మన్ ఎన్వి.వేణుగోపాలచారి అన్నారు. రేఖంపల్లి సబ్‌స్టేషన్ ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యుత్తు సరఫరాలో తరచూ అంతరాయం, మీటర్ల సమస్య, ఎక్కువ బిల్లులు తదితర సమస్యలపై అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. నల్లబెల్లి, దుగ్గొండి, నర్సంపేట సెక్షన్ల పరిధిలోని రైతులు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. రమేశ్, చరణ్‌దాస్, ఎస్ఈ మధుసూదన్‌రావు, ఏఈఈ శ్రీధర్, ఏడీఈలు లక్ష్మణ్, రాకేశ్,శ్రీధర్, ఏఈలు రామ్మూర్తి, ప్రత్యూష పాల్గొన్నారు.

తాగునీరు రాక ఇబ్బందులు

చెన్నారావుపేట, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో కొన్ని రోజులుగా తాగునీరు అందక కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారు. తాగునీటి బావిలో చెత్తాచెదారం, పూడిక చేరడంతో నీరు కలుషితమైంది. పైపులైన్ లీకేజీతో నీరు అందడం లేదని, మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా కావడం లేదని స్థానికులు ఆరోపించారు. సమస్యను ప్రత్యేకాధికారికి పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీటి సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాలని కోరారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: బయోవేస్ట్‌ను మున్సిపల్ చెత్తలో వేస్తూ వ్యాధుల విజృంభణకు కారణమతున్న వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా కాలుష్యనియంత్రణ మండలి అధికారులకు తెలంగాణ వైద్యమండలి సిఫారసు చేసింది. బుధవారం వైద్య మండలి పబ్లిక్ రిలేషన్ కమిటీ ఛైర్మన్ డా.నరేష్‌కుమార్, హెచ్ఆర్‌డీఏ జిల్లా నాయకుడు డా.దొమ్మటి ప్రసన్న.. జిల్లా కాలుష్య నియంత్రణ మండలి అధికారిణి ఆర్.సునీతను కలిసి సిఫారసు లేఖను అందజేశారు. కొందరు అర్హతలేని వైద్యులు ఇష్టానుసారం ఉపయోగించే మందులపై చర్యలు తీసుకోవాలన్నారు.